


# చక్రం

సింహాద్రి పెందరాళే భోంచేసి, గబగబ ఒక బీడీ కాల్చేసి, పైగుడ్డ భుజాన వేసుకుని - బయలుదేరాడు. పాకాల - అక్కడికి మూడు మైళ్లల్లో వున్న ఊరు. అతడికి పాకాలలో ఏదో పనుంది. ఆ పని చూసుకుని, అలాగే రాత్రికి భారతం చూచి రావాలి.

సింహాద్రి బరువుగా వున్నాడు. అతని బరువు వందా ముప్పై రూపాయలు. అతని జేబులో వందా ముప్పై రూపాయలున్నాయి. ప్రొద్దు పోయింది. చీకటి! నడిస్తే ఒక గంట ప్రయాణం. తాను బరువుగా వున్నాడు. దారిలో-తాను దొంగల దగ్గర తేలికై పోవచ్చు గదా అన్న అనుమానం కలిగింది. బస్సెక్కాడు. మరో పది నిమిషాల్లో బస్సు దిగాడు.

వేంకటేశ్వర వస్త్రాలయం మూయబడివుంది. సింహాద్రి ఆ బట్టలకొట్టు యజమానికి - బట్టలు కొన్న

తాలూకు బాకీ ఎనభై రూపాయ లివ్వాలి. ఆ బాకీ కాస్తా యిచ్చేసి, పాత లెక్క కొట్టించేసి, రాత్రికి భారతం చూసు కుని తెల్లవారగనే పల్లెకు వెళ్ళిపోదామనుకున్నాడు. కాని, ఇప్పుడు తన రెండుపనులూ ముందు వెనుకలయ్యాయి. మొదట భారతం చూడడం. తెల్లవారింతర్వాత బాకీ యిచ్చేసి యింటికెళ్ళిపోవడం.

జేబులో రూపాయిదాకా చిల్లరడబ్బు లున్నాయి. సింహాద్రి టీ కొట్టులో దూరాడు. టీ త్రాగాడు. బీడీ ముట్టిస్తూ, ప్రక్కనున్న ఆసామీని టైమెంతైందన్నాడు. ఆయన ముంజేతి గడియారం చూచి, ఎనిమిదైందన్నాడు. సింహాద్రి వీధికేసి చూచాడు. దీపాలతోరణంలా వుంది బజారు. దుకాణాల్లో సందడి యింకా తగ్గలేదు. సింహాద్రి బీడీ ముక్క అవతల పారేసి, కొట్టువాడికి డబ్బులిచ్చి బయట పడ్డాడు. 'భారతం మిట్ట' కేసి దారితీశాడు.

పాకాలలో ప్రతి ఏడాది వేసవికాలంలో వరుసగా యిరవైరోజులపాటు భారతం జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటిగంటనుండి సాయంకాలం అయిదుగంటలదాకా భారత కథా కాలక్షేపం, రాత్రి తొమ్మిది నుండి తెల్లవార్లూ ప్రదర్శ నమూ జరుగుతాయి. ప్రతి సంవత్సరమూ - యీ తతంగ మంతా - వూరిబయటి-మునసబుగారి స్థలంలో జరుగుతుంది. ఆస్థలం కొన్నిఎకరాల వైశాల్యంతో పెద్ద దిబ్బలా వుంటుంది. కాలక్రమాన ఆ స్థలానికి భారతంమిట్ట అని పేరు వచ్చింది.

గ్రామవీధుల గుండా దూరి, తిరుపతిరోడ్డుమీద నడిచి, పూరుపేట దగ్గర కాలిబాట వెంబడే భారతంమిట్ట చేరు కున్నాడు, సింహాద్రి.

మాయాబజారును మరపింపజేస్తోంది ఆ ప్రదేశం. ఒకచోట-ఆటగాళ్ళకోసం ఏర్పరచిన విడిదిగృహం ముందు ఎత్తైన వేదికఒకటి అమర్చబడివుంది. ఆ వేదికకు మూడు వైపులా నేల ఈనినట్లు ఆడా మగా, జనం ముసురుకొని వున్నారు. వేదికకు దగ్గరగా కొంతమేరవరకు చుట్టూ వెదురుకర్రలు అడ్డుగా కట్టివున్నారు. టిక్కెట్టు తీసుకున్న వాళ్ళుమాత్రమే అందులో కూర్చుంటారు. లేనివాళ్లు బయట కూర్చుంటారు. ఒకమనిషి - చేతిలో బెత్తంతో-సింహాద్రిని, మరికొందరిని దూరంగా వెళ్ళండంటూ అదలించాడు. ఆడ వాళ్ళవైపునకూడా మరొక వేత్రహస్తుడు అదే విధంగా అరుస్తున్నాడు. సింహాద్రి దూరంగా వెళ్ళాడు. వేదికకు ఎట్ట ఎదుట - దూరంగా-ఒక పెద్ద పందిరివుంది. అపరాహ్ణంపూట అక్కడ కథకుడు కథచెబుతాడు. శ్రోతలు ఆ పందిరి నీడలో కూర్చుని వింటారు. వేదికకు కుడిప్రక్కగా ఆ పందిటివరకు వరుసగా ఏవేవో దుకాణాలున్నాయి. టీ, చిరుతిళ్ళు, పిండి వంటలు, గాలిబుడగలు, పండ్లు, ఆటవస్తువులు వగైరాలు కొల్లలుగా అమ్ముడు పోతున్నాయి అక్కడ. సింహాద్రికి సిగరెట్టు తాగాలనిపించింది. ఒక అంగడిలోకి వెళ్ళి సిజర్ సిగరెట్టు యిమ్మన్నాడు. "ఆరుపైసలు యిలా తే" అన్నాడు వాడు. "ఒక్క సిగరెట్టు ఆరుపైసలే!" అన్నాడు సింహాద్రి

ఆశ్చర్యంగా. "ఈ అంగడి నేల బాడుగ వందరూపాయలే!" అన్నాడు అంగడివాడు.

ఆట మొదలైంది. సింహాద్రి సిగరెట్టు ముట్టించాడు. ద్రౌపదీ వస్త్రాభరణం! చూస్తే "కంగుంది-కుప్పం" వాళ్ళ ఆటే చూడాలి. ఆట రసవత్తరంగా వుంది. జూదంలో పాండవులు ఓడిపోయారు. రాజ్యం పోగొట్టుకున్నారు. దుశ్శాసనుడు ద్రౌపదిని అవమానిస్తున్నాడు. "ముట్టబోకురా" అంటూ తీయని కంఠంతో ఏడుస్తున్నాడు ద్రౌపది పాత్రధారి. సింహాద్రి - పాచికలను, దుష్టచతుష్టయాన్ని, ప్రత్యేకంగా జూదాన్ని దుమ్మెత్తిపోశాడు. "పాడుజూదం. మాయదారి జూదం. ధర్మరాజంతటి వాడిచేత దాసోహమనిపించింది. అందుకే గాబోలు-ఆడది, సారా, జూదం తగవన్నాడు మా తాత!"

చాలసేపు చూడ్డంచేత-ఆటమీద మనస్సు తగ్గింది. కాస్సేపు ఒంటరిగా వుండాలనిపించింది. దూరంగా చింత చెట్ల క్రిందికి వెళ్ళి నిలబడ్డాడు. అక్కడ దీపాల్లేవు. ఆకాశంలో మేఘాల చెమ్మలో నుండి-చంద్రుడు గ్రుడ్డివెన్నెల వెదజల్లుతున్నాడు. చింత చెట్ల గుబురుల క్రిందికి ఆ మసక వెన్నెలకూడా సరిగ్గా చొరలేక పోతోంది. చల్లటిగాలివీచి, సింహాద్రి ఒళ్ళంతా ఝల్లు మనిపించింది. అతడు మళ్ళీ బీడీ వెలిగించి వేదికవైపు చూశాడు. ద్రౌపదిగొంతు సన్నగా కీచుమని వినిపిస్తోంది.

"ఎవరక్కడ?" అని ద్రౌపది గొంతులాంటి గొంతు వినిపించింది దగ్గర్లోనే. సింహాద్రి చుట్టూచూశాడు. చింత చెట్ల క్రింద మసక చీకట్లలో-ఒక పొద దగ్గరినుంచి వినిపించింది ఆ గొంతు. "ఏం?" అన్నాడు సింహాద్రి. "మొగాళ్ళ కిక్కడేం పని?" అంది ఆ తీయని గొంతు.

సింహాద్రి తలెత్తి ఆ ఆకారంకేసి చూశాడు. తెల్లటి చీర, ఎర్రని జాకెట్టు, సిగనిండుగ చేమంతిపూలు, వక్కలు ఆకులు నమిలి ఎరుపెక్కిన పెదవులతో ఒక మోహనాకారం కనిపించిందతనికి. అతడు తడుముకోకుండా "ఆడవాళ్ళ కిక్కడేం పని?" అన్నాడు. ఆమె కిలారున నవ్వింది. సింహాద్రి సిగ్గుపడ్డాడు. అతనిఒళ్ళు ఎందుకో జలదరించింది. "నా పేరు మోహిని" అంది ఆమె నవ్వుతూ. "చెప్పకనే తెలుస్తోంది" అన్నాడు సింహాద్రి. "అక్కడేమీ బాగాలేదు. ఇక్కడే హాయిగా వుంది. కదూ?" అంది మోహిని. సింహాద్రికి భయం వేసింది. తాను ముప్పైఏళ్ళ పడుచువాడు. అందులోనూ బరువుగా వున్నాడు. తేలికైపోవచ్చు. "ఎవరికి ఎక్కడ హాయిగా వుంటే వాళ్ళు అక్కడ వుండొచ్చు" అంటూ దూరంగా వున్న వేదికవైపు కదిలాడు. వెనుకనుండి వినిపించిన ఆ మధురహాసం అతని మనస్సునేమో ఆకర్షించింది గానీ, అతని శరీరాన్నిమాత్రం ఆకర్షించలేకపోయింది.

దూరంగా రంగులరాట్నం గిరగిర తిరుగుతున్నది. ఒకటే పరిభ్రమణం, దానిది. తిరిగిన గుర్రమే మళ్ళీమళ్ళీ

తిరుగుతూంది , జీవితంలోని కష్టసుఖాల్లా, అదృష్టమూ దుర దృష్టాల్లా. సింహాద్రి చూపు మళ్ళించాడు. ఇద్దరు గ్రామీణులు మాట్లాడుకుంటున్నారు. ఒకాయన ఆకాశంకేసి చూస్తూ అంటున్నాడు. "తప్పదు. ఈ రోజు వర్షం రావాల్సిందే! నాకు బాగా అనుభవం. ద్రౌపదీ వస్త్రాభరణమప్పుడు, తపస్సు మానప్పుడు, విరాటపర్వమప్పుడు, దుర్యోధన వధప్పుడు వాన కురవకపోవడం యింతవర కెప్పుడూ లేదు."

రెండో ఆయన అంటున్నాడు- "ఇంతవరకూ - ఈ వూళ్ళో- భారతం వానా కాలంలోతప్ప మరొకప్పుడు జరగ లేదు."

అర్ధరాత్రి అయివుంటుందనుకున్నాడు సింహాద్రి. ఇంతలో అతనికి ఒకచోట ప్రత్యేకంగా ఒక పెద్ద గుంపు కనిపించింది. చాలా విచిత్రంగా వుంది ఆ గుంపు. నేలమీద దుప్పటిపరచి, దానిమీద ఓపిడికెడు చింతగింజలు వుడ్డ పేర్చి నట్టు కనిపిస్తోంది ఆ గుంపు. అతడి కాళ్లు అక్కడికి కదలి పోయాయి.

జూదం!

పెట్రొమాక్సు లైటు కాంతిలో నిర్భయంగా జూద మాడుతున్నారు. ఒక ఆసామీ - తన ముందర ఒకటిన్నర గజం పొడవు, ఒక గజం వెడల్పు వున్న దళసరి బట్ట పరచు కొన్నాడు. అది ఏడు భాగాలుగా విభజింపబడివుంది.

ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క బొమ్మ చొప్పున ఆరుభాగా ల్లో - ఒంటె, ఏనుగు, గుఱ్ఱము, పులి, జింక, నెమలి— యీ ఆరు బొమ్మలూ వున్నాయి. ఏడవభాగం కాస్త పెద్దది. అందులో డబ్బు కుప్పవుంది. ఆ మనిషి ప్రక్కనే ఒక పెట్టెలో బల్ల పరుపుగా ఒక చక్రం అమర్చబడివున్నది. అదికూడా- అశోక చక్రంలోని రేఖల్లా కొన్ని భాగాలుగా భాగింపబడి వుంది. ఒక్కొక్క భాగంలోనూ మూడేసి బొమ్మలున్నాయి. ఆ మూడు బొమ్మలూ - క్రిందపరచివున్న దళసరి బట్టలోని బొమ్మల్లోనివే కాని వేరే కావు. ఆ మూడు బొమ్మలూ ఏ రకంగానైనా వుండవచ్చు. మూడూ నెమలి బొమ్మలే కావచ్చు; మూడూ ఏనుగు బొమ్మలే కావచ్చు; ఒక ఏనుగు, ఒక పులి, ఒక గుఱ్ఱమూ కావచ్చు. రెండు పులులూ ఒక గుఱ్ఱమూ కావచ్చు. ఎలాగైనా వుండవచ్చు-కాని- మూడు బొమ్మలు మాత్రం వుంటాయి. చక్రం చుట్టూ అంచున ఒక్కొక్క భాగాన్ని ప్రత్యేకిస్తూ నిలువుగా చీలలు గ్రుచ్చబడి వున్నాయి.

చక్రానికి ప్రక్కన ఒకముల్లు అమర్చారు. అది ఎప్పుడూ చక్రంలోని ఒక భాగాన్ని సూచిస్తూవుంటుంది. క్రిందపరచివున్న బొమ్మల్లో ఎవరికి నచ్చిన బొమ్మపైన వారు డబ్బు పడేస్తారు. చక్రం ఆసామీ చక్రాన్ని త్రిప్పుతాడు. ఆ చక్రం అరనిమిషంసేపు గిఱ్ఱున తిరిగి, నిశ్చలంగా ఆగు తుంది. ప్రక్కనుండి చక్రంలోనికి చొచ్చుకొనివున్న ముల్లు

చీలలతో రాపాడుతూ - చక్రం ఆగగానే-చక్రంలో ఏవో ఒక మూడుబొమ్మల్ని చూపుతుంది. ఎవడి అదృష్టం బాగుంటే వాడిపైన డబ్బులవాన కురుస్తుంది. లేకపోతే వాడినోట్లో నుండి తిట్లవాన కురుస్తుంది.

సింహాద్రికి యీ ఆట మొదట అర్థంకాలేదు. చూడగా చూడగా అర్థమైంది. డబ్బులు బొమ్మలమీద కురుస్తూనేవున్నాయి. చక్రం తిరుగుతూనే వుంది. సింహాద్రికి ఒకసందేహం కలిగింది. "పోలీసువాళ్లు చూస్తే ఏమీ చేయరూ?" అంటూ ప్రక్కనున్న కుర్రవాడి చెవిలో గుసగుసలాడాడు. "పైనుండి కిందిదాకా ఆ కట్టుదిట్టాలన్నీ జరిగిపోయాయిలే. భయంలేదు" అన్నాడు ఆ కుర్రాడు. నిజమే!...సూర్యుడు వచ్చి వెతికినా-ఆ భారతం మిట్టలో ఒక్క పోలీసువాడైనా కనిపించడు.

సింహాద్రికి కాస్త ధైర్యం చిక్కింది. అతని మనస్సును "మోహిని" కూడా ఆకర్షించలేకపోయింది. అటువంటి ఘనకీర్తి ఆ చక్రానికే దక్కింది ... అందరూ పైసలుపెట్టి ఆడుతూంటే - ఒక మల్లుదుస్తుల పెద్దమనిషి రూపాయలతో ఆడుతున్నాడు. అతడు రెండు రూపాయలు నెమలిమీద పెట్టాడు. చక్రం ఆగింది. ముల్లు రెండు నెమళ్ళను, ఒక పులిని చూపింది. అతడి రెండు రూపాయలు మరి నాలుగు రూపాయలను కలుపుకుని ఆరు రూపాయలైంది. మల్లుబట్ట

లాయన | ఈసారి నెమలిమీద ఒక రూపాయి వుంచాడు. ముల్లు ఒక నెమలిని, ఒక ఏనుగును, ఒక గుర్రాన్ని చూపించింది. చక్రం మనిషి ఆ రూపాయతో బాటు మరొక రూపాయి యిచ్చాడు. అతడు యీ మారు నెమలి మీద ఐదు రూపాయలుంచాడు. మూడు నెమళ్లు! చక్రం మనిషి ముఖం మాడ్చుకుంటూ ఆ అయిదు రూపాయలతో మరి పదిహేను రూపాయలిచ్చాడు.

ఇదంతా చూచి సింహాద్రి యిక ఆగలేకపోయాడు. బొమ్మలబట్టకు దగ్గరగా కాస్త స్థలం సంపాదించి, అక్కడే తిష్ట వేశాడు. జేబులోనుండి నోట్లు గబగబ పైకి వచ్చాయి. సింహాద్రి చాలాసేపు ఆడాడు. అతడి పందెం రూపాయి నుండి పది రూపాయలదాకా పెరిగింది. వస్తోంది. పోతోంది. రానురాను అతనిలో పట్టుదల పెరిగింది. చిట్టచివర ఒక్క రూపాయి మిగిలింది. దాన్ని ఏనుగులో వేశాడు. ముల్లు మూడు జింకల్ని చూపించింది. రూపాయి కూడ పోయింది. జింకబొమ్మ మీది డబ్బు లెవరివోగాని అది – మరి మూడంతలు పెరిగాయి.

సింహాద్రికి ఏడుపొచ్చినంత పనైంది. తాను తేలికై పోయాడు. ఒకటి రెండుగంటల ఆట పరిచయంలోనే–అతడు ఆ చక్రం ఆసామీ పేరు తెలుసుకున్నాడు. "అయ్యా ముత్యాలయ్యా! నాది వందా ముప్పైరూపాయలు పోయాయి.

నువ్వు చూస్తూనే వున్నావుగా? నాది బుద్ధి పొరబాటే! ఒప్పుకుంటాను. ఇంకెప్పుడూ దీని జోలికిరాను. రేపు తెల్లారితే కూలివాళ్లు నామానం దక్కనివ్వరు. గుడ్డలవాడికి కావలిస్తే నిదానంగా యివ్వచ్చు. ఒక ముప్ఫై రూపాయలిచ్చేయి. నే నిప్పుడే వెళ్ళిపోతాను. నీకు పుణ్యం వుంటుంది. చచ్చి నీ కడుపున బుడతాను" అంటూ మొరబెట్టుకున్నాడు. అక్కడ మూగినవాళ్లు చాలమంది గొల్లుమన్నారు. కొందరు- తమలో తాము నవ్వుకోకుండా వుండలేకపోయారు.

సింహాద్రి అరగంటసేపు బ్రతిమిలాడాడు. ప్రయోజనం లేకపోయింది. ముత్యాలు అన్నాడు — "ఇదిగో బైతయ్యా! ముందు నన్ను సలహా అయినా అడిగివుంటే ఆడబోకని చెప్పేవాణ్ణి. అంతా చేయిదాటిపోయింది. ఇదేం వేళాకోళమూ, తమాషాకాదు. జూదం! ఎవరెవరి అదృష్టం ఎంతెంతో యిక్కడ తేలిపోతుంది. లాభం వచ్చిన వాడెవ్వడూ మాకు తిరిగి యిచ్చెయ్యడు. పోనీ పో, పాపం-ఏం జేస్తావ్? ఇంకోసారి ఎప్పుడూ దీని జోలికి రాకుండా జాగర్త పడు."

"రేపు నేను నారు నాటించాలి. నిన్నటి కూలి డబ్బులివ్వక పోతే కూలివాళ్లురారు. నా వ్యవసాయం మట్టిగొట్టుకుపోతుంది బాబో..." అన్నాడు సింహాద్రి ముఖమంతా ఎరుపు జేసుకుని.

ముత్యాలు డబ్బివ్వలేకపోయాడుగాని - అందుకొక దారి మాత్రం చూపించాడు. "ఇదుగో నయ్యోవ్! ఇందులో నాకెంతమాత్రం స్వతంత్రం లేదు. నేను - చౌదరి గారు పెట్టిన మనిషిని మాత్రమే! నాతో చెప్పుకుని ప్రయోజనమేమీ లేదు. అదిగో అక్కడున్నారు చూడు చౌదరి గారు. ఆయనతో చెప్పుకోపో! నిన్ను రక్షించినా, భక్షించినా ఆయనే!"

సింహాద్రి - చౌదరి నెరిగిన ఒక మనిషిని వెంటబెట్టుకుని - ఆయన దగ్గరికి వెళ్ళాడు. చౌదరితో తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు. "...నాది వందా ముప్ఫైరూపాయలు! పోయాయి! ముప్ఫైరూపాయలుమాత్రం తిరిగిస్తే చాలు..."

చౌదరి మంచివాడు. డబ్బు ప్రసక్తి రానంతవరకే ఆ మంచితనం! అటువంటి మనిషి సింహాద్రి గోడు విని కొంచెం జాలిపడ్డాడు. మెత్తగా మందలించాడు. "రైతువి ఆ మాత్రం జ్ఞానం లేదూ? ఈ జూదాలూ యివంతా పొరంబోకులకు గానీ - సంసారులం మనకు దేనికి? - ఇప్పుడెంత మొత్తుకున్నా లాభమేముంది? నేనేమీ చెయ్యలేను. నలుగు రైదుగురం భాగస్వాములం. నాదొక్కడిదే పెత్తనమైతే ముప్ఫైరూపాయలిచ్చేందుకుఅభ్యంతరమేమీ లేదు. అయినా పోనీ పాపం అని అయిదు రూపాయలిప్పిస్తాను. ఇదిగో - ఈ

చీటీ తీసుకుపోయి ముత్యాలుగాడికియ్యి. ఐదు రూపాయ లిస్తాడు...'' అంటూ చీటీ వ్రాసిచ్చాడు చౌదరి.

సింహాద్రి ఏమనుకున్నాడో ఏమో - నోరు మెదప కుండా చీటీ అందుకున్నాడు. ముత్యాలు దగ్గరికెళ్ళి అతని చేతిలో చీటీ వుంచాడు. విసుగు, జాలి రెండూ మేళవించిన నవ్వుతో ముత్యాలు ఐదురూపాయలు సింహాద్రి కందించాడు.

సింహాద్రి ముఖంలో యిప్పుడు గాంభీర్యం ఆవరిం చింది. ఐదు రూపాయలు తీసుకుని దూరంగా వెళ్ళి కాస్సేపు అటూ యిటూ పచార్లు చేయడం ప్రారంభించాడు. ప్రతి మనిషీ అతడికి దిగులు ముఖంతో కనిపించాడు. అతడు మళ్ళీ చక్రం దగ్గరికి వచ్చాడు. చక్రందగ్గర కునికిపాట్లు పడు తున్న ముత్యాలు—''ఏం? యిక్కడేవున్నావా? వెళ్ళడా నికి మనసు రాలేదూ? మళ్ళీ యిక్కడికొస్తే బాగుండదు- చెబుతున్నాను'' అన్నాడు అతన్ని చూచి.

సింహాద్రి వెళ్ళిపోయాడు. పదిపదిహేను నిమిషాల తర్వాత—మళ్ళీ చక్రం దగ్గర ప్రత్యక్షమయ్యాడు.

ఇప్పుడు—చక్రం దగ్గర ముత్యాలు లేడు. మరెవడో వున్నాడు. అతడు చాల చురుగ్గావున్నాడు. ముత్యాలు నిద్ర భరించలేక వెళ్ళిపోయినట్టుంది. సింహాద్రి ధైర్యాన్నికూడ

దీసుకుని చక్రం దగ్గర కాస్త చోటు సంపాదించగలిగాడు. బాగా పద్మాసనం వేసుకుకూర్చున్నాడు. పోయిన డబ్బు ఎలాగూ పోయింది. దానితో పోల్చితే ఈ ఐదు రూపాయ లేపాటి? పోతే మరొక అయిదు. వస్తే తన పందాముపైన! సింహాద్రి తెగించి ఆ అయిదురూపాయిల నోటును నెమలి పైన వేశాడు. చక్రం గిరగిరా తిరిగి ఆగేసరికి-అతని అదృష్ట సూచి మూడు నెమళ్ళను సూచించింది. సింహాద్రి ఎగిరి గంతు లేయబోయి అలాగే కూర్చున్నాడు. ఐదు రూపాయలిప్పుడు యిరవై రూపాయలకు పెరిగింది. అతనిలో ఆశ, విశ్వాసమూ పెరిగాయి. అతడు ఆడుతున్నాడు. ఆకాశం నల్లబడుతోంది. మేఘాలు ఆకాశంనిండా అల్లుకుపోయి వెన్నెలను కప్పేస్తు న్నాయి. సన్నటి తుంపర రాలుతోంది. సింహాద్రి గంటసేపు ఆడాడు. తన్ను తాను పూర్తిగా మరచిపోయి ఆడాడు. అందరికీ అతని ఆట ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వాళ్ళ ఆశ్చర్యం ఎక్కువైనకొద్దీ తుంపర జోరు ఎక్కువైంది. ఉన్నట్టుండి వర్షం విరుచుకు పడింది.

క్షణంలో—క్రింద పరచివున్న బొమ్మలబట్ట గబగబ చుట్టివేయబడింది. చక్రంపెట్టె మూసివేయబడింది. అందరూ వానలో తడుస్తూ ఆత్మ సంరక్షణార్థం చుట్టూ వున్న అంగళ్ళలోకి పరుగు తీశారు. అలా పరుగుదీసిన వాళ్ళల్లో- సింహాద్రి ఒకడు.

భారతం ఆటనిలిచిపోయింది. బయలులో ఒక్క పిట్ట యినాలేదు. వర్షం కుండపోతగా కురుస్తోంది. అంగళ్ళల్లో త్రొక్కిడి ఎక్కువైంది. స్థలంచాలక మనుషులు గిజగిజ లాడిపోతున్నారు. దుకాణాలపైన కప్పిన కొబ్బరిఆకుల్లో నుంచికూడా క్రమంగా నీరు జారడం ప్రారంభించింది. భరిం పరాని చలి వేస్తోంది. సింహాద్రి టీత్రాగాడు. బీడీముట్టించాడు. చలి! కండువాను జేబుకడ్డంగా కప్పుకున్నాడు. గట్టిగా చేతులు గట్టుకుని నిలబడ్డాడు.

వర్షం రెండుగంటలసేపు కురిసి వెలిసింది. గంట ఐదయింది. చాలమంది యిళ్ళకు వెళ్ళిపోయారు. దుకాణాల్లో సందడి, రద్దీ చాలవరకు తగ్గిపోయాయి.

సింహాద్రి జేబులోని డబ్బు బయటికితీశాడు. లెక్క పెట్టుకున్నాడు. వందా ముప్ఫై రూపాయలున్నాయి!... ఆశ్చర్యపడ్డాడు. పదమూడువందల రూపాయలున్నంత తృప్తిపడ్డాడు. అతని మనస్సులో ఒకమూల దురాశవంటిది మెదిలింది. "ఈ వర్షం ఒకటి రాకపోతే-మరెన్ని రూపాయలు గలిచేవాణ్ణో?..."

అతనిలో దాగిన సంతృప్తి అతన్ని మందలించింది... "సమయానికి ఆ వాన విరుచుకుపడివుండకపోతే — ఈ

వందాముప్పై రూపాయలైనా మిగిలివుంటాయని నమ్మక మేమిటీ ?!"

క్రమంగా ఆకాశం ప్రకాశవంత మౌతోంది.

సింహాద్రి ఆ రూపాయల్ని మళ్ళీ జేబులో దాచు కుంటూ—"అదృష్టమూ, దురదృష్టమూ-యివి ఒక చక్రం లోని రెండు భాగాలు గాబోలు! మనిషిపట్ల ఆ చక్రం ప్రభావం ఎప్పుడేవిధంగా వుంటుందో ఎవరికి తెలుసు ?" అనుకున్నాడు.

★ ★